క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల



నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తున్న అధికారులు

లింగాపూర్: రాష్ట్ర ఎలక్షన్ కమిషన్, కలెక్టర్ ఆదేశాల మేరకు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు తుది పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో విడుదల చేశారు. ఎంపీడీవో రామచందర్, ఎంపీవో రజనీకాంత్, బాపురావు, భూపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీలు అమలు చేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

తిర్యాణి: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు బండారి తిరుపతి అన్నారు. ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మండలంలోని సుంగాపూర్‌లో శనివారం ఆవిష్కరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా నేటికి హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, జాడీ విలాస్, దుర్గం చంద్రయ్య, రాందాస్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాతర దుకాణాలు వేలం

రెబ్బెన: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని నంబాలలో ప్రసన్న పరమేశ్వర ఆలయంలో నిర్వహించే జాతర ఉత్సవాలను పురస్కరించుకుని కొబ్బరికాయల విక్రయం, తైబజార్, వాహనాల పార్కింగ్ కోసం సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. ఈనెల 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు ఆలయంలో నిర్వహించే జాతరలో కొబ్బరికాయల విక్రయం, తైబజార్, సైకిల్ స్టాండ్, లడ్డు ప్రసాదం, సంవత్సర కిరాణ దుకాణం నిర్వహణ కోసం వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువులో రాణించాలని మాలీ యువజన సంఘం కన్నెపల్లి అధ్యక్షుడు మోర్లె పాండురంగ్ అన్నారు. శనివారం మాలీ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కన్నెపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నేను సావిత్రి బాయి పూలే అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలన్నారు. వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నిల్వ ఉంచిన బియ్యం తరలింపు



బియ్యం పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలోని నిల్వ ఉంచిన బియ్యాన్ని శనివారం తహసీల్దార్ పుష్పలత తరలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల క్రితం 20 క్వింటాళ్ల మధ్యాహ్న భోజన బియ్యంను అధికారులు ఎంఈవో కార్యాలయంలో నిల్వ ఉంచారని, కరోనా లాక్‌డౌన్ కారణంగా పాఠశాలను మూసి వేయడంతో అక్కడే నిల్వ ఉన్నాయన్నారు. బియ్యం చెడిపోయి దుర్వాసన రావడంతో విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు గొయ్యి తవ్వి బియ్యంను పూడ్చివేసినట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంఈవో గావుడే హన్మంతు, సిబ్బంది ఉన్నారు.

'అపార్' నమోదు ఆలస్యం!

- 33 శాతమే పూర్తి
- విద్యార్థుల పేర్లలో తేడాలు
- నెట్‌వర్క్ లేకపోవడంతోనూ ఇబ్బందులు

కెరమెరి(ఆసిఫాబాద్): ప్రతీ విద్యార్థికి ఆటోమేటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు చేయాలని కేంద్రం విద్యాశాఖను ఆదేశించింది. అయితే నమోదులో మాత్రం జిల్లా వెనకబడి ఉంది. అడ్మిషన్ రికార్డు ఆధారంగా యూడైస్‌ను విద్యాశాఖ వందశాతం నమోదు చేసింది. యూడైస్ ప్లస్‌లో ఉన్న నమోదుతో ఆధార్ సరిపోలినప్పుడే అపార్ నమోదు సాధ్యమవుతుందని సాంకేతిక సహాయకులు చెబుతున్నారు. ఆధార్‌లో ఇంటి పేరు, విద్యార్థి పేరులో అక్షరం తేడా ఉన్న నమోదు కావడం లేదు.

సవరణలో ఇబ్బందులు..

ఆధార్ సవరించుకోవాలంటే పుట్టిన ధ్రువ పత్రం పొంది ఉంటేనే సాధ్యమవుతుంది. మరోవైపు విద్యార్థుల తల్లిదండ్రులు వీటి సవరణలో స్పందించడం లేదని ప్రధానోపాధ్యాయలు చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 15 మండలాలు ఉండగా.. అన్ని యాజమాన్యాల కింద 1195 పాఠశాలలు, కళాశాలలున్నాయి. వీటిలో 1,00586 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శనివారం ఉదయం వరకు జిల్లాలో 32.85 శాతం ఆపార్ నమోదైంది. అయిదేఇంటర్ కళాశాలల్లో పరీక్షల షెడ్యూల్ విడుదల కావడంతో వీటి ప్రక్రియ కొంత వెనకడుగులో ఉంది.

అవరోధాలెన్నో..

చైల్డ్ ఇన్ఫో వైబ్‌సైట్‌లో విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు చేసేందుకు పాఠశాలలు కళాశాలలకు వేర్వేరు ఐడీలు ఉంటాయి. వీటి ఆధారంగా కేంద్ర ప్రభుత్వం అపార్ కార్డులను మంజూరు చేస్తుంది. దీంట్లోని గుర్తింపు సంఖ్య ఆధార్ తరహాలో విద్యార్థుల శాశ్వత కాలం అందుబాటులో ఉంటుంది. విద్యార్హతులు, గ్రేడ్‌లు, మార్కులు సాధించిన ప్రగతి, ఉపకార వేతనాలు, ఇతర ధ్రువపత్రాల సమాచారాన్ని కుటుంబసభ్యుల వివరాలను పొందుపరుస్తారు. ఉన్నత విద్య ప్రవేశాలు, పోటీ పరీక్షలకు డిజిటల్ పత్రాలను ప్రమాణికంగా తీసుకుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న అపార్‌కు తల్లిదండ్రుల అంగీకారాన్ని తప్పనిసరి చేశారు. కానీ విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఆధార్‌లో తప్పలు ఉండడం వల్ల వివరాల నమోదులో ఆలస్యమవుతుంది.



గోయగాం పాఠశాలలో అపార్ నమోదు చేస్తున్న టీచర్

ఆధార్ వివరాలు	మండలాలు	గ్రామ పంచాయతీలు	పాఠశాలలు, కళాశాలలు
	15	335	1195
	విద్యార్థులు 1,00586	అపార్ నమోదు 32.85 శాతం	

వెంటనే పూర్తి చేయాలి

ఆశ్రమ, ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు వెంటనే అపార్ నమోదు పూర్తి చేయాలి. ఆధార్‌లో తప్పుల ఆధారంగా నమోదు ప్రక్రియలో ఆలస్యం అవుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఆధార్ వ్యాలిడేషన్ జిల్లాలో 52 శాతం పూర్తయింది. వీరికి అపార్ నమోదు ఇబ్బంది ఉండదు. – గమానియల్, డీఈవో

పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శన



జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఎంపీడీవో కోట ప్రసాద్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దీపక్, సాయికృష్ణ, శ్రీకాంత్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన తుది పోలింగ్‌స్టేషన్లో ఓటర్ జాబితా మండల కేంద్రాలలో ఆయా మండలాల అధికారులు ప్రచురిస్తున్న నేపథ్యంలో శనివారం ఆసిఫాబాద్ ఎంపీడీవో శ్రీనివాస్ కార్యాలయం ఆవరణలో పోలింగ్ కేంద్రాల జాబితా ప్రదర్శించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది బాలేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 51 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో అంజద్‌పాషా తెలిపారు. శనివారం మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించారు. త్వరలో జరిగే ఎంపీటీసీ ఎన్నికల కోసం ఈ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండలంలో నిర్వహించనున్న స్థానిక సంస్థలు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల జాబితాను శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారీగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ కేంద్రాలను జాబితాను బోర్డుపై అతికించారు.



జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్



జాబితా ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

తిర్యాణి: వేసవిని దృష్టిలో పెట్టుకొని మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని శనివారం తహసీల్దార్ సూర్యప్రకాశ్‌కి డీవైఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్ మాట్లాడుతూ గత ఏడాది వేసవి తాగునీటి కోసం మండలవాసులు ఇబ్బంది పడ్డారన్నారు. మూరుమూల గ్రామాలల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోడిసెల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



లంబాడిహేటిలో..

చింతలమానెపల్లి: మండలంలో సేవాలాల్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. లంబాడిహేటి, రణవెల్లి, గుప్పగూడెం గ్రామాల నుంచి బంజారా కులస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల నుంచి ర్యాలీగా వచ్చి రవీంద్రనగర్‌లోని సేవాలాల్ చౌరాస్తా వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం అన్నదానం చేశారు.

కెరమెరి: మండల కేంద్రంలోని సేవాలాల్ నగర్‌కు వెళ్లే దారి సమీపంలో శనివారం సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. హోమం నిర్వహించి జెండా ఆవిష్కరించారు. సంత్ సేవాలాల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భోగ్ బండార్, నవధాన్యాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ శంకర్ నాయక్, రాథోడ్ శేశారావు, బానోత్ వెంకట్ నాయక్, శివప్రసాద్, రాథోడ్ రూప్‌లాల్, రాథోడ్ రమేశ్, రవినాయక్, ఉత్తం నాయక్ పాల్గొన్నారు.



భోగ్‌భండార్‌లో పాల్గొన్న భక్తులు

లింగాపూర్: మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, వంకామద్ది, ఖుట్టాభద్రా, రామునాయక్‌తండా, గోపాల్‌పూర్, కీమానాయక్‌తండా, మోతీపటార్, పిక్లాతండా, నడ్డంగుడా గ్రామాల్లో శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. బంజారా దుస్తుల వేషధారణ ధరించి, డప్పు చప్పుళ్లతో నృత్యం చేశారు. ఆలయ పూజారి నైవేద్యాలతో భోగ్ భండార్ నిర్వహించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని మాలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్ రావ్ అన్నారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. గెలుపొందిన కౌటాల జట్టుకు రూ. 30వేలు, రన్నరప్‌గా నిలిచిన ముత్తంపేట్ జట్టుకు రూ. 20వేలు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. యువత అన్నిరంగాల్లో రాణించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆదే శ్రీనివాస్, బందురావ్, సత్యనారాయణ, ధోని రవి, ఆకాశ్, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

పొంచి ఉన్న ప్రమాదం

దహెగాం మండలంలోని కల్వాడ గ్రామ పంచాయతీ కార్యాలయంపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. దీంతో పంచాయతీ సిబ్బంది తీగలకు సపోర్ట్‌గా కర్రలు ఏర్పాటు చేశారు. గాలివీస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

- దహెగాం



అధ్వానంగా రహదారులు

- ప్రమాదకరంగా గుంతలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు

చింతలమానెపల్లి: మండలంలో రహదారుల పరిస్థితులు అధ్వానంగా మారింది. ప్రధాన రహదారులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలు పడ్డాయి. నాణ్యత లోపంతో నిర్మించడంతో మున్నాళ్ల ముచ్చటగానే మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

రహదారులు ఇలా..

మండలంలోని ఖర్జెల్లి నుంచి గూడెం వరకు సుమారుగా 18 కిలోమీటర్ల దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ రహదారి చింతలమానెపల్లి నుంచి మహారాష్ట్రలోని అహేరికి వెళ్లే మార్గంలో ఉండగా గత కొన్నేండ్ల క్రితం ప్రాణహిత నది వంతెన పూర్తయింది. 18 కిలోమీటర్ల రహదారి అటవీ ప్రాంతం కారణంగా మలుపులు, చెట్లతో ప్రమాదకరంగా ఉంటుంది. ప్రతీ ఏడాది సుమారుగా 40 వరకు చిన్న, పెద్ద ప్రమాదాలు నమోదు అవుతున్నాయి. మహారాష్ట్రకు రవాణా కారణంగా గత సంవత్సర కాలంగా ఇక్కడ రద్దీ పెరిగింది. నియోజకవర్గ కేంద్రం కాగజ్‌నగర్ నుంచి మండలానికి చేరుకోవడానికి మండలంలోని డబ్బా మీదుగా, కౌటాల మండల కేంద్రం మీదుగా రహదారులు ఉన్నాయి.



రవీంద్రనగర్ సమీపంలో కుంగిన రోడ్డు

మట్టితో మరమ్మతులు..

ప్రాణహిత నదిపై వంతెన నిర్మాణం పూర్తి అనంతరం పెరిగిన రద్దీ కారణంగా రహదారి ప్రమాదకరంగా మారింది. 18 కిలో మీటర్ల మార్గంలో ఖర్జెల్లి నుంచి గూడెం వరకు భారీగా గుంతలు ఏర్పడ్డాయి. బీటీరోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల మట్టితో మరమ్మతులు చేశారు. దీంతో భారీ వాహనాలు వెళ్లినపుడు దుమ్ముతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు పూర్తిస్థాయిలో రహదారి పనులు నిర్వహించకపోతే వర్షాకాలం రాకపోకలకు ఇబ్బంది తలెత్తే అవకాశం ఉంది. మండలంలోని డబ్బా మీదుగా బాబాసాగర్ వరకు అడుగడుగునా గుంతలు ప్రయాణికుల సహనానికి పరీక్షగా మారింది. కౌటాల మండలం తలోది గ్రామం నుంచి రవీంద్రనగర్ మీదుగా చింతలమానెపల్లి వరకు రహదారి పలుచోట్ల ఒక వైపుగా కుంగిపోయింది.



గూడెం రహదారిపై వేసిన మట్టి

భారీ వాహనాలతోనే..

కౌటాల మండలంలోని ముత్తంపేట సమీపంలో కంకర క్రషర్ల నుంచి నిత్యం మహారాష్ట్రకు భారీ టిప్పర్ల ద్వారా కంకర తరలిస్తున్నారు. ఈ కంకర మండంలోని రవీంద్రనగర్ మీదుగా, డబ్బా మీదుగా తరలిస్తున్నారు. ఖర్జెల్లి నుంచి గూడెం వరకు ఉన్న ఆర్అండ్‌బీ రహదారిపై భారీ వాహనాలకు అనుమతులు లేవని శాఖ అధికారులు తెలియజేస్తున్నారు. కాంట్రాక్టర్‌కు చెందిన భారీ వాహనాలు ప్రతీ రోజులు పదుల సంఖ్యలో కంకరను తరలిస్తున్నాయి. దీంతో రహదారులు గుంతలు పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రామిక మహిళా దినోత్సవం విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

తలమడుగు: వచ్చే నెల మార్చి 8న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర కో కన్వీనర్ గణేష్ కోరారు. శనివారం శ్రామిక మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరించారు. మహిళలు పనిచేసే ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు, వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు మనోజ్, జ్ఞానేశ్వర్, పోచన్న, కేశవ్, రాము, జనక్ పటేల్, అశోక్, నీలిగిరి లక్ష్మి, రఘునాథ్, గోవిందరావు, హన్మంత్ పాల్గొన్నారు.

'సమష్టిగా పని చేస్తేనే విజయం'



మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

నార్నూర్: కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించవచ్చని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించటమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అన్నివర్గాల హామీలు నెరవేర్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లోకండే దేవరావ్, షేక్ నసీర్, మారుతి, కరీం ఖాన్, జాకిరుల్ల, గజానన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.